క్లుప్తంగా

గరీబ్ నవాజ్ గ్యార్మీ షరీఫ్‌లో ప్రార్థన



నర్సంపేట : పట్టణంలోని మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మసూద్ బేగ్ నివాసంలో సోమవారం హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తి రహ్మతుల్లా అలైహి (గరీబ్ నవాజ్) గ్యార్మీ షరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ హాజరై అల్లాకు పుష్పాలు సమర్పించి ప్రార్థన చేశారు. అనంతరం మసూద్ బేగ్ ఏర్పాటు చేసిన అతిథ్యాన్ని స్వీకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నాయకులు మెరుగు సాంబయ్య, అయూబ్, డిష్ బాబా తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నెక్కొండ: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన శాడ సరితరెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు సాజీద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరిత రాష్ట్ర సాధన ఉద్యమంలో అన్ని వర్గాలను చైతన్యవంతం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డికి సరిత కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థికి రూ.లక్ష సాయం



గీసుకొండ: మండల కేంద్రానికి చెందిన బండారు రవికుమార్ ఎంఎస్ చదివేందుకు అమెరికాకు వెళ్లనుండగా అతడికి రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి గీత లక్ష్మీనారాయణ దంపతులు మంగళవారం రూ.లక్ష సాయం అందజేశారు. రవికుమార్ అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు సాయం అందజేసినట్టు లక్ష్మీనారాయణ దంపతులు తెలిపారు.

అవయవ దాత కుటుంబానికి..

గీసుకొండ: మండల కేంద్రానికి చెందిన కర్లకంటి శ్రీకాంతాచారి బ్రెయిన్ డెత్‌కు గురి కాగా అతడి అవయవాలను అతడి తల్లిదండ్రులు దానం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి తల్లిదండ్రులకు అతడితో కలిసి 2002–03లో టెన్త్ బ్యాచ్ విద్యార్థులు రూ.30 వేల సాయం అందజేశారు. అలాగే 2009–10 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు రూ.17 వేలు అందించి సంతాపం తెలిపారు.

మాదన్నపేటలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాదన్నపేటకు చెందిన పెసర రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల నగదుతోపాటు క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో సాంబరాజు, నర్సి, సన్నీ, సాయి, నాగరాజు, పవన్, అఖిల్, కల్యాణ్, అజీమ్‌పాషా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని గుగులోతుతండాకు చెందిన మూడు నర్సింహ అనారోగ్యంతో ఉదయశ్రీ ఆస్పత్రిలో, దౌలత్‌నగర్‌కు చెందిన మాలోతు సర్దార్ తల్లి శాంత ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి గార్డెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆయా ఆస్పత్రుల్లో ఇద్దరినీ వేర్వేరుగా కలిసి మంగళవారం పరామర్శించారు. ఇద్దరికీ ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేద కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డాక్టర్ కాళీప్రసాద్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గోజి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంప్లాయిస్ యూనియన్ బాధ్యులు మంగళవారం పరామర్శించారు. అనంతరం బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు జాటోతు పకీర, అధ్యక్షుడు పోరిక జీవన్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ఘనంగా సంక్రాంతి



చెన్నారావుపేట : ముగ్గులు వేస్తున్న మహిళలు



సంగెం : తిమ్మాపూర్‌లో..



చెన్నారావుపేట:గంగిరెద్దుకు పూజ చేస్తున్న జనం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, సంగెం, గీసుకొండ, నల్లబెల్లి, నెక్కొండ, ఖానాపురం, దుగ్గొండి, తదితర మండలాల్లో ఊరూరా సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. తెల్లవారు జామునే మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలను అలంకరించారు. గంగిరెద్దుల రాకతో పండగ వాతావరణం మరింత శోభను సంతరించుకుంది. పలు గ్రామాల్లో మహిళలు గంగిరెద్దులను పూజించారు. పిల్లలు, యువత పతంగులు ఎగరేసి సందడి చేశారు. ప్రజలు కుటుంబాలతో ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో పట్నం

సంగెం: మకర సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని గవిచర్ల, ఆశాలపల్లి శివారులోని శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మేల్కొలుపు పూజలు, పంచామృత అభిషేకం, అన్న పూజ నిర్వహించారు. అనంతరం అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. స్వామి వారిని సకినాలు, మామిడి తోరణాలు వివిధ పుష్పాలతో అలంకరించారు. ఒగ్గు పూజారులు స్వామి వారికి బోనం చెల్లించి చిన్న పట్నం వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లబోయిన కిశోర్, ఆలయ కమిటీ చైర్మన్ కూచన సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంగెం : ఆలయంలో వేసిన పట్నం

శ్రీకంఠమహేశ్వరుడికి బోనం

వర్ధన్నపేట: పట్టణంలోని తాటివనంలో గౌడ కులస్తులు శ్రీసూరమాంబ శ్రీ కంఠమహేశ్వరుడికి బోనం సమర్పించారు. తాటి వనంలోని ఆలయాన్ని మామిడిఆకులు, పూలదండలతో అలంకరించారు. తొలుత పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా నెత్తిన బోనంతో కుల పెద్ద వడ్లకొండ శ్రీనివాస్, ఎల్లాగౌడ్ డప్పుచప్పుళ్లతో తాటివనంలోకి చేరుకుని బోనం సమర్పించారు. కార్యక్రమంలో దొమ్మటి రాజన్న, దొమ్మటి భానుచందర్, వడ్లకొండ శ్యాంప్రసాద్, బండి కుమారస్వామి, పులి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనుమ వేడుకలు

దుగ్గొండి మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగ వేడుకలను జరుపుకున్నారు. అన్నదాతలు ఆవులు, దుక్కిటెద్దులను అలంకరించి పసుపు, కుంకుమతో పూజించారు. నాచినపల్లిలోని రామాలయంలో గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు రమేశ్‌మూర్తి, నాగేందర్‌స్వామి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, కాసిడి అజయ్, నంగునూరి సాంబయ్య, మామిడాల మురళి పాల్గొన్నారు.



దుగ్గొండి : గోమాతను పూజిస్తున్న అన్నదాతలు



వర్ధన్నపేట : బోనంతో వస్తున్న గౌడ కులస్తులు

కత్ర్యాల మల్లన్నకు పూజలు



వర్ధన్నపేట : పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



పర్వతగిరి : బోనాలతో మహిళలు

వర్ధన్నపేట: మండలంలోని కత్ర్యాల గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి (మల్లన్న) జాతరకు భక్తులు పోటెత్తారు. మల్లన్నకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండాలని, పిల్లాపాపలు ఆరోగ్యంగా ఉండాలని, పశువులు బాగా ఉండాలని కోరారు. మంగళవారం రాత్రి ఎడ్ల బండ్లు తిరిగే కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగిసింది.

దర్శించుకున్న ప్రముఖులు

కత్ర్యాల మల్లికార్జునస్వామికి మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రాజిరెడ్డి, గుజ్జ రవీందర్‌రెడ్డి, అరూరి రమేష్ వెంట ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, సర్పంచ్ గుజ్జ సంపత్ రెడ్డి ఉన్నారు.

గోపనపల్లిలో దూడల మల్లికార్జునస్వామి జాతర

పర్వతగిరి : గోపనపల్లిలో మల్లికార్జునస్వామి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గొల్ల, కురుమల ఆరాధ్యదైవమైన దూడల మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు మండలంలోని వివిధ గ్రామాలతోపాటు సమీప మండలాల ప్రజలు తరలి వచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హాజరు కాగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం

మండలంలోని గోపనపల్లి గ్రామంలోని దూడల మల్లికార్జున స్వామి ఆలయ కమిటీని ప్రభుత్వం అధికారికంగా నియమించక ముందే స్థానిక కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారన్న అపవాదు మూటగట్టుకున్నారు. ఆలయ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం విమర్శలకు తెరతీసింది. ఏటా అధికార పార్టీ నాయకులతోనే కమిటీ ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కాగా జాతర ముగియనున్న సమయానికీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు తామే కమిటీగా పేర్కొంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

ప్రొటోకాల్‌ను విస్మరించిన జీపీ కార్యదర్శి

దూడల మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేయాల్సిన ఫ్లెక్సీలో సీఎం, మంత్రి, ఎమ్మెల్యే ఫొటోలకు బదులు మాజీ సీఎం, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీపై సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు ఫొటోలకు బదులు పంచాయతీ కార్యదర్శి సదానందం మాజీల ఫొటోలను పెట్టించడం వివాదాస్పందంగా మారింది. పంచాయతీ కార్యదర్శి తీరు సీఎంను, ఎమ్మెల్యేను కించే పర్చేలా ఉందంటూ పలువురు బహిరంగంగానే మండిపడడం కనిపించింది.

విజేతలకు బహుమతుల ప్రదానం



నర్సంపేట రూరల్ : విజేతకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లిలో రంగవల్లు పోటీలు నిర్వహించి జమాండ్ల దేవేంద్ర–రాజలింగం దంపతుల కూతురు రుచిత జ్ఞాపకార్థం విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని ఆగారపు అంజలి, ద్వితీయ బహుమతిని పొన్న మహేశ్వరి, తాడుగుంజుడులో మొదటి బహుమతిని అందె కవిత బృందం, ద్వితీయ బహుమతిని దూపటి నీరజ, కుర్చీ పరుగులో మొదటి బహుమతిని అందె కవితకు సర్పంచ్ మండల రవీందర్, ఉపసర్పంచ్ జమాండ్ల చంద్రమౌళి అందజేశారు.

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లిలో డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు బాషుమియా మాట్లాడారు. వీర్ గాథ 3.0లో ప్రతిభ కనబర్చి ఎంపికైన కాసాని కీర్తి ప్రసన్నను సన్మానించారు. కార్యక్రమంలో పెరుమాండ్ల మానస, శ్రీధర్‌రెడ్డి, అందె వెంకటేశ్వర్లు, వట్టె శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి దేవేందర్, హరీశ్, నర్సారెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు, భిక్షపతి, రమేశ్ పాల్గొన్నారు.

నల్లబెల్లి: మండలంలో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడోత్సవాల సందర్భంగా కబడ్డీ, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సమావేశానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు దామ సాంబయ్య అధ్యక్షత వహించగా మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నాగెల్లి కొంరయ్య, నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కొర్నేల్, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కుసుంబ బాబురావు, నాయకుడు మార్త నాగరాజు, మనోహర్, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నల్లబెల్లి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి



చెన్నారావుపేట : కీర్తి ప్రసన్నను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బీఆర్‌ఎస్ నాయకుడు కంది కృష్ణచైతన్యరెడ్డి బహుమతులు అందజేశారు. జంగిలి శ్రుతి మొదటి, కేశపాక జ్యోతి ద్వితీయ, కొమ్ముల జ్యోతి తృతీయ, సాదు పావని నాల్గో బహుమతి గెల్చుకున్నారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద బర్ల దేవదాసు, కొంకటి రమేశ్, వార్డు సభ్యులు జంగిలి సదయ్య, నవీన్, అజయ్, సాంబయ్య, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో జ్యోతి దర్శనం



నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం శబరిమలై జ్యోతి దర్శన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆభరణాలకు మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, శ్రీరాం ఈశ్వరయ్యగుప్తా, శింగిరిగొండ మాధవ శంకర్‌గుప్తా నివాసాల్లో పూజ చేశారు. అనంతరం మాలధారులు, భక్తులు మంగళవాయిద్యాలతో టపాసులు పేల్చుతూ ప్రధాన రహదారి గుండా రాగా ప్రజలు దర్శనం చేసుకున్నారు. ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడిలో స్వామి వారికి అలంకరించి పూజ చేశారు. అనంతరం ఆలయ శిఖరంపై వెలిగించిన మకర జ్యోతుల దర్శనాన్ని ప్రజలు తిలకించారు.

ఫ్రీజర్ అందజేత



గీసుకొండ: మండలంలోని గంగదేవిపల్లికి లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆత్మీయ ఆధ్వర్యంలో మంగళవారం మృతదేహాలను భద్రపర్చే ఫ్రీజర్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధి డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడారు. గంగదేవిపల్లి, ఊకల్, కొమ్మాల, విశ్వనాథపురం గ్రామాల ప్రజల కోసం రూ.60 వేల విలువైన ఫ్రీజర్‌ను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనె మల్లారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మార్గం ప్రభాకర్, డాక్టర్ తిలక్, అల్లం చిన్నపురెడ్డి నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : టీఎస్‌డబ్ల్యూఈఐఎస్, టీటీడబ్ల్యూఆర్ ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీఆర్‌ఈఐఎస్ గురుకులాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఆర్.సమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 18 నుంచి 20 వరకు వరకు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంక్ మేనేజర్ సమత

రాయపర్తి: బ్యాంక్ ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధించగలరని జిల్లా కేంద్ర సహకార (డీసీసీ) బ్యాంక్ వర్ధన్నపేట శాఖ మేనేజర్ సమత తెలిపారు. మండలంలోని సూర్య తండాలో నాబార్డ్ ఆర్థిక సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో సమత మాట్లాడారు. బ్యాంక్ ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లిస్తూ తిరిగి పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రతీఒక్కరూ తప్పనిసరిగా పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమా చేయించుకోవాలని కోరారు. నాబార్డ్ ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రంగు సురేశ్ కుమార్, సర్పంచ్ అమ్మి మాంజ్యానాయక్, పీఏసీఎస్ కార్యదర్శి సోమయ్య, డైరెక్టర్ సోమనాయక్, మాజీ డైరెక్టర్ రవినాయక్, కోఆర్డినేటర్ శంకర్‌నాయక్, బ్యాంక్ సిబ్బంది ఉమేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం: పాకాల ఆయకట్టు కింద పూర్తిస్థాయిలో సాగుకు నీరు ఇవ్వలేమని కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులకు క్షమాపణ చెప్పాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకుల మాటలతో రైతులు ఆందోళనకు గురౌతున్నారని, ఎమ్మెల్యే మాధవరెడ్డి జోక్యం చేసుకుని యాసంగికి నీటి సరఫరాపై స్పష్టత ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నాయకులు నీరు ఇవ్వలేకుంటే తాము అందిస్తామని చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా పెద్ది సుదర్శన్ రెడ్డి పూర్తిస్థాయిలో సాగు నీరు అందించగా ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరెడ్డి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కలెక్టర్, ఆర్డీఓ స్పందించి బుధవారంలోగా ప్రకటన చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు మౌలానా, కుమారస్వామి, ఎల్లయ్య, బాబురావు, రాంనర్సింహారెడ్డి, సుధాకర్, అశోక్, లింగయ్య, రామస్వామి, అశోక్, పూలునాయక్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువకులకు ఘన సన్మానం



నరేశ్, అనిల్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

చెన్నారావుపేట: మండలంలోని పత్తినాయక్‌తండాకు చెందిన గిరిజన యువకులు జాటోతు నరేశ్, జాటోతు అనిల్ ప్రతిభ చాటగా వారిని సర్పంచ్ జాటోతు స్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. తండాకు చెందిన జాటోతు నిర్మల–నర్సింగ్ దంపతుల కొడుకు నరేశ్ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన యూపీఎస్సీ పరీక్షలో ప్రతిభ చాటి జియాలజీ విభాగంలో సైంటిస్ట్‌గా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించగా జాటోతు విజయ–ఈర్య నాయక్ దంపతుల కొడుకు అనిల్ వైద్య విద్యలో సీటు సాధించాడని చెప్పారు. ఈ క్రమంలోనే ఇద్దరినీ సన్మానించినట్టు తెలిపారు. నరేశ్, అనిల్ స్ఫూర్తితో మిగతా గిరిజన యువత ముందుకు సాగాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువులకు పేదరికం అడ్డంకి కాదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు.

మున్నూరు కాపు పరపతి సంఘం కమిటీ ఎన్నిక

తొర్రూరు: కాపు సంఘం డివిజన్ అధ్యక్షుడు జలకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు పరపతి సంఘం నూతన కమిటీని డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా మూల శేఖర్, కోశాధికారిగా సలుగు నర్సయ్య, కార్యవర్గ సభ్యులుగా ఆకుల పుల్లయ్య, మార్గం సంపత్, శివ, గోపి, సుకన్య, భాస్కర్, నవీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీని కాపు సంఘం, పరపతి సంఘం నాయకులతోపాటు కులస్తులు అభినందించారు.

కోలాటం బ్యాచ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం: మండలంలోని కుంటపల్లి గ్రామంలోని కోలాటం బ్యాచ్ శ్రీ మంజునాథ శివజ్యోతి పరపతి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హనుమకొండలోని తన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, నాయకులు అచ్చ నాగరాజు, రావుల రాధిక, సింగం యాకలక్ష్మి, రాగిడి సరిత, కావటి రజిత, పెంతల ప్రతాప్, కొమురుమల్లు, రాజమల్లు, వరదరాజులు, యాకయ్య, రమేశ్, రాజు, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మధు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

21న టీజేఎస్ రాష్ట్ర సదస్సు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జన సమితి నాయకులు

నర్సంపేట : ఈనెల 21న హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ తెలిపారు. సదస్సు వాల్‌పోస్టర్లను పట్టణంలో మంగళవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. గతేడాది జనవరి 30న ఢిల్లీలో దీక్షలు చేపట్టినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. విభజన హామీల సాధన ఉద్యమం తీవ్రం చేయడానికి ఈనెల 21న సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుంటి రాంచందర్, బోనగాని రవీందర్, గుంటి సంజీవ, సాయికుమార్, మల్లేశం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా..

గూడూరు: మండలంలోని మచ్చర్ల శివారు దేవుడి గుట్టపై ఉన్న మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. ఆలయం వద్ద చేపట్టిన జాతర పనులను డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. గుట్ట కింద జాతర చివరి రోజు ఎల్లమ్మ కల్యాణం, బోనాల సమర్పణ వేడుకలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేతో కమిటీ పెద్దలు మల్లికార్జునస్వామి చిత్రపటాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడారు. సీడీఎఫ్ నిధులతో ఆలయ నిర్మాణ, మౌళిక వసతుల ఏర్పాటు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అక్కడ నుంచి లైన్‌తండా గ్రామంలో సీతారామ యూత్ క్లబ్ నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే షీల్డులు అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్నయాదవ్, కొమ్మాలునాయక్, బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధు గౌడ్, ఎడ్ల నరేష్‌రెడ్డి, కలీల్‌పాషా పాల్గొన్నారు.

సాక్షి
దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274